విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

త్రాగునీటికి ఆటంకాలు ఉండకూడదు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : వాతావరణ కేంద్రం హెచ్చరికలు నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఆమేరకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సరఫరా లో ఎటువంటి ఆటంకాలు లేకుండా తగిన ముందుస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ రెవిన్యూ డివిజనల్ అధికారి ఎ. చైత్ర వర్షిణి గురువారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఓలు త్రాగునీటి సరఫరా లో ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భవనాలు, మాల్స్, దేవాలయాలు, స్కూల్స్, ఇళ్ళు లేని నిరుపేదలకు రాత్రి బస చేసే ప్రదేశాల్లో, తదితర ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని, శివారు ప్రాంతాల్లో నివాస గృహాలకు , బహిరంగ ప్రదేశాల్లో పనులు చేసే కార్మికులకు, సమస్యాత్మక ప్రాంతాల్లో నీడ వుండేలా చూసుకోవాలన్నారు. స్థానికంగా ఉండే పార్కులను సాయంత్రం వేళల్లో తెరిచి ఉంచాలని, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, ఇతర సేవా సంస్థల ఆధ్వర్యంలో తగిన వసతులు కల్పించాలని, త్రాగునీరు, మజ్జిగ పంపిణీ కోసం ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా, ఆసుపత్రుల చుట్టూ ఆవరణ చల్లగా ఉండేలా చూసుకోవాలన్నారు.

వైసీపీలోకి వలసల వెల్లువ

విశాలాంధ్ర - రౌతులపూడి : రౌతులపూడి మండలంలో వైయస్సార్ పార్టీలో చేరే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగు తున్నది. తాజాగా గురువారం ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సమక్షంలో రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం గ్రామం నుంచి గుర్రం వెంకటరమణ, గుర్రం తాతబాబు, గుర్రం గోవిందు, గుర్రం రంగబాబు, గుర్రం భద్ర రావు, చిట్రా గోవిందు, గొర్లె వీరబాబు, గొర్లె బాబులు, గొర్లె ముసలి, పంపన బోయిన సింహాద్రి, గింజల దేవుడు, బత్తుల రమణ, గొర్లే సత్తిబాబు, గింజల పోతురాజు, సుమారు 50 కుటుంబాలు టీడీపీనీ వీడి వైఎస్ఆర్సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కండువాలు కప్పి పార్టీ లోనికి ఆహ్వానించారు. జెడ్పీటీసీ గొల్లు లక్ష్మణమూర్తి, మండల వైస్ ఎంపీపీ తిరుమల రాయలసీ రెడ్డి, వైయస్సార్సీపీ నాయకులు వాసిరెడ్డి జీమీలు, గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రధానంగా వారి మధ్యే పోటీ

విశాలాంధ్ర - జగ్గంపేట : జిల్లాలో మెట్ట ప్రాంతంగా పేరుగాంచిన నియోజకవర్గం జగ్గంపేట. ఇక్కడ ఎప్పుడు ప్రధాన పార్టీల నేతల మధ్యే పోటీ ఉంటుంది. అదే తరహాలో ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిగా టిడిపి నేత జ్యోతుల నెహ్రూ పోటీలో ఉంటే, అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున మాజీ మంత్రి తోట నరసింహం పోటీలో ఉన్నారు. ఇలా వీరిద్దరి మధ్యే ప్రధానంగా పోటీ నెలకొని ఉంది. జగ్గంపేట నియోజకవర్గంలో గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం, జగ్గంపేట మండలాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు 2008లో చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో గోకవరం మండలం ఈ నియోజకవర్గంలో చేరింది. ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి నియోజకవర్గంలో ఉన్న రంగంపేట మండలం అప్పుడు జగ్గంపేట నియోజకవర్గంలో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా రంగంపేట మండలం అనపర్తి నియోజకవర్గంలోకి వెళ్ళగా, గోకవరం మండలం జగ్గంపేట నియోజకవర్గంలోకి వచ్చింది.

గోపాలపురంలో వైసీపీకి షాక్

తెలుగుదేశం పార్టీలో చేరికలు

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం మండలం గోపాలపురం గ్రామం నుండి వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరికలు జరిగాయి. వీరికి కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, భాజపా ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

విశాలాంధ్ర - అనపర్తి : అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని ఓటర్లకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి విజ్ఞప్తి చేశారు. గురువారం పులగుర్తలో వైసిపి నేతలు, కార్యకర్తలతో కలిసి ఆదిలక్ష్మి ఇంటింటికి వెళ్లి వైసిపి అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సత్తి సూర్యనారాయణ రెడ్డి, గూడూరి శ్రీనివాస్ ను గెలిపించాలని కోరారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో సంక్షేమ పాలన అందించారని మరోసారి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, సీఎం జగన్ ను ఓటర్లు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ బుల్లి రెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి (కుతుకులూరు), పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలోని 14వ వార్డు బ్రిడ్జి పేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నూతన ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ మేనేజర్ పోలిశెట్టి శివ నూతన ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటింటికి వెళ్లి ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి ఓటు లేని వారికి కొత్త ఓటును ఆన్లైన్ ద్వారా నూతనంగా ఎలా చేర్చాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షులు దేగల రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

విశాలాంధ్ర - గండేపల్లి : 12వ తేదీ ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జగ్గంపేట ఎలక్ట్రికల్ డిఈ కే రత్నాలరావు తెలిపారు. వార్షిక మరమ్మతులు మరియు చెట్టుకొమ్మలు కటింగ్ వర్క్ నిమిత్తం 33% ఉప్పలపాడు ఫీడర్ పరిధిలో ఉప్పలపాడు సబ్స్టేషన్, ఎన్‌టి రాజా పురం సబ్ స్టేషన్, మరియు బొర్రంపాలెం సబ్స్టేషన్‌లో గల అన్ని గ్రామాలు మరియు అగ్రికల్చర్ బోర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది అని, కావున ఈ యొక్క అంతరాయాన్ని గమనించి విద్యుత్ సంస్థకు మరియు విద్యుత్ సిబ్బందికి, మండల గ్రామస్తులు మరియు రైతులు సహకరించాలని, జగ్గంపేట ఎలక్ట్రికల్ డిఈ కెరత్నాలరావు గండేపల్లి ఏఈ ఎస్. సునీత తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల సంతృప్తి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ రూపొందించిన మార్గదర్శకాలు మేరకు వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న పనితీరు, రికార్డుల నిర్వహణ పట్ల రాష్ట్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం తూర్పు గోదావరి జిల్లా పర్యటన లో భాగంగా రాష్ట్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా కలక్టరేట్ లో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా కే. మాధవీలత ,ఎస్పి జగదీష్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్ మోహన్ మిశ్రా సువిద, తదితర విభాగాల్లో నిర్వహిస్తున్న రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతికూల వార్తలు, సంఘటనలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన నేపథ్యంలో అధికారులూ చేపడుతున్న కార్యకలాపాలపై సమగ్ర సమాచారం తెలుసు కున్నారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది,అధికారులతో మిశ్రా సంభాషించి, ఆయా రికార్డుల నిర్వహణ కోసం తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకుని, వారికి గల అవగాహన పట్ల సంతృప్తి వ్యక్తం చేసి ప్రోత్సహించారు. సి విజిల్, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి తీసుకున్న చర్యల గురించి పరిశీలకులకు కలెక్టర్ మాధవీలత వివరించారు. రెవిన్యూ, పోలీసు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకున్నట్టు తెలియ చేశారు. తొలుత కలెక్టరేటులో ఏర్పాటు చేసిన సువిధ సెల్ ను పరిశీలించి నామినేషన్ల నమూనా ఫారం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ రిజిస్టర్ ను పరిశీలించారు. వివిధ అనుమతుల కోసం వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారం వివరాలు తెలుసు కున్నారు. ఏ ఏ అనుమతులు జారీ చేయడం జరుగుతుంది, అందుకు అను గుణంగా అక్కడ ఏర్పాటు చేసిన నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం స్వీప్ కార్యక్రమం, ఓటర్ అవేర్నెస్ నేపథ్యంలో తీసుకున్న ఫొటో గ్యాలరీని సందర్శించారు. సమీకృత కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సి విజిల్., ఎమ్ సి సి., ఎక్సపెండిచర్ సెల్, సువిధ కంట్రోల్ కేంద్రం, జిల్లా స్థాయి ప్రధాన కంట్రోల్ రూం, 1890 425 2540 టోల్ ఫ్రీ, 1950 కాల్ సెంటర్, ఎస్ జి ఎస్పి సెల్, ఫిర్యాదుల పర్యవేక్షణ విభాగం, వెబ్ కాస్టింగ్, జిపిఎస్ ట్రాకింగ్, మీడియా పర్యవేక్షణ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ సి విజిల్ యాప్, ఎమ్ సి ఎం సి , కంప్లైంట్ పై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. మీడియా లో వచ్చే ప్రతికూల వార్తలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులకు సంబంధించి వివరాలు, జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు ఎప్పటికప్పుడు పంపించి వివరణలు తెలుసుకోవడం, ఆ సమాచారం రాజకీయ పార్టీలకు తెలియ చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్పి పి .జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ కే. దినేష్ కుమార్, అదనపు ఎస్పీ పి. అనీల్ కుమార్, డి ఆర్వో జీ. నరసింహులు ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మూడు పూరిళ్లు దగ్ధం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : కొండవరం గ్రామంలో మూడు పూరిల్లు దగ్ధం కావడంతో సుమారు 20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలుపుతున్నారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం కొండవరం గ్రామం గొల్లపేటకు చెందిన మోకుర్తి సత్తిబాబు గేదెల పాకలో బుధవారం మధ్యాహ్నం సమీపంలో ఉన్న చెత్తను దగ్గరకు చేర్చి నిప్పు పెట్టాడు. అగ్గి రవ్వలు ఇంటికి అంటుకోవడంతో సమీపంలో ఉన్న అన్నదమ్ములు వెంకటరమణ, వీరస్వామి ఇళ్లకు వ్యాపించాయి. అదే సమయంలో సత్తిబాబు ఇంట్లో గ్యాస్ బండ పేలడంతో మంటలు తీవ్రంగా వ్యాపించా యని స్థానికులు తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా అప్పటికే మూడు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో ఇంట్లో ఉన్న సామాన్లు, నగదు అగ్నికి ఆహుతవ్వడంతో సుమారు 20 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని స్థానికులు తెలుపుతున్నారు. సంఘటన స్థలాన్ని కాకినాడ ఎంపీ పిఠాపురం అభ్యర్థి వంగ గీత బాధిత కుటుంబాల పరామర్శించి భరోసా కల్పించారు.

సహాయ హెల్పింగ్ ఫౌండేషన్ రక్తదాన, కంటి వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - మండపేట : స్ఫూర్తి ప్రదాతలు మహాత్మ జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించు కుని రక్తదాన, కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని విద్యుత్ శాఖ జనరల్ మేనేజర్ తిలక్ కుమార్, పాస్టర్ ఆర్. విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఏడిద గ్రామంలో సహాయ హెల్పింగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు యడ్ల సత్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. జై భీమ్ యూత్, బాబు జగజీవన్ రామ్ యూత్ సభ్యుల సహకారంతో గురువారం స్థానిక లూథరన్ చర్చ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాలను ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలోని యువత రక్తదానం చేశారు. తొలుత గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ యడ్ల వెంకట్రావులు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైద్యులు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. 18 నిండిన యువతీ యువకులు రక్తాన్ని ఇవ్వడం వల్ల పరోపకారంతో మన శరీరానికి కూడా మంచిదని చైతన్య పరిచారు. తలసేమియా వ్యాధిగ్రస్థ పిల్లల కోసం స్వచ్ఛందంగా 55 మంది యువకులు రక్తదానం చేసినట్టు సంస్థ అధ్యక్షుడు సత్య తెలిపారు. 45 మందికి కంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు.

ఇంటింట టీడీపీ

విశాలాంధ్ర-దేవరపల్లి: పరిపాలనాదక్షత, అనుభవం కలిగిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్, తెలుగుదేశం నాయకుడు గన్నమని హరికృష్ణ పిలుపునిచ్చారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం, దేవరపల్లి గ్రామాలలో గురువారం ఇంటింటా తెలుగుదేశం పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంద్రు అనిల్, హరికృష్ణ మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసి ఆంధ్ర ప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దే నని అన్నారు జగన్ పరిపాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన బిజెపి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గౌరీపట్నం దేవరపల్లి గ్రామాలలో ఇంటింటా సూపర్ సిక్స్ పథకం కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రామారావు, లింగమూర్తి రాజు, ఎం. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన పసలపూడి

విశాలాంధ్ర-పెరవలి : పెరవలి మండలం పెరవలి గ్రామస్తులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కుమ్మర శాలివాహన జిల్లా అధ్యక్షుడు పసలపూడి భద్రయ్య ఏప్రిల్ 11వ తేదీ గురువారం నిడదవోలు మాజీ శాసనసభ్యులు నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రబాబు చేతుల మీదగా పసలపూడి భద్రయ్యకు తెదేపా కండువాను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుండి తెలుగుదేశంలో క్రియాశీలక కార్యకర్తగా వ్యవహరించిన తను కొంతకాలం వేరే పార్టీలోకి వెళ్ళవలసి వచ్చిందని తిరిగి సొంతగూటికి చేరుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు తనను తెలుగుదేశం పార్టీ లోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు కు కృతజ్ఞతలు తెలియజేసారు.

వేగుళ్లను మార్చనున్నారా?

విశాలాంధ్ర - అమలాపురం : మండపేట టిడిపి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టికెట్ మారుతున్నదంటూ పెద్దఎత్తున ప్రచారం జోరందుకుంది. మండపేట నియోజకవర్గంలోనే కాకుండా డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా మండపేట టిడిపి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును మార్చి మరో యువనాయకునికి ఇస్తున్నారంటూ సాగుతున్న ఈ ప్రచారం టిడిపి శిబిరంలో సందిగ్ధతకు దారితీసింది. దానికి కారణం ఎన్నికల పోరులో తన ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి తోట త్రిమూర్తులు తన కంటే ముందుకు దూసుకుపోతున్నారని, మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా అభివృద్ధి చేసింది శూన్యమని ఎన్నికల ప్రచారంలో ఓటర్లు ప్రశ్నిస్తుండటంతో వారికి సమాధానం చెప్పటానికి ఇబ్బంది పడుతున్నారని సన్నిహిత వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఎమ్మెల్యే అయి ఉండి కోవిడ్ సమయంలో సొంత రైస్ మిల్లు ఉండి కూడా కష్టాల్లో ఉన్న పేదలకు గుప్పెడు బియ్యంకూడా పంచకుండా నిర్లక్ష్యం చేసారని, ఎన్నికల ప్రచారంలో ఓటర్లు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు సార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో చేసినా అభివృద్ధి ఏమి లేదని ఏదన్నా పనికోసం వెళ్లిన వారిని ఓటుకి డబ్బులు తీసుకున్నారు కదా అని హేళన చేసేవారని ఇప్పుడు ప్రత్యర్థి పార్టీ ప్రచారంలో గతకాలపు జ్ఞాపకాలు గుర్తు చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో చేసిన నిర్లక్ష్యం ఆయన్ని శాపంలా వెంటాడుతుంటే ప్రత్యర్థి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం నుండి అధిక నిధులు తీసుకువచ్చి మండపేటలో దీర్ఘకాలంగా ఉన్న ఎన్నో సమస్యలు పరిష్కరించారన్న ప్రచారం జోరందుకుంది. వైసిపి అభ్యర్థి తోట త్రిమూర్తులు నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనారిటీ వర్గాలు బాహాటంగానే మద్దతు నిస్తున్నట్లు తెలుస్తోంది. మండపేట ఎమ్మెల్యేగా మూడుసార్లు పనిచేసిన వేగుళ్ల ఏ గ్రామంలో పర్యటించినా ప్రజల నుండి వస్తున్న తీవ్ర వ్యతిరేక ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని సన్నిహితులు చెబుతున్నారు.

సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రజా సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కూటమి ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్య ప్రభ రాజా తనయుడు, టీడీపీ యువ నాయకుడు సాయితర్షిత్ అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ఆర్టీసీ కాలనీలో ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ప్రచారంలో భాగంగా తర్షిత్ ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహించే సంక్షేమ పథకాల కోసం వివరిస్తూ మ్యానిఫెస్టో కర పత్రాలను పంచారు. సైకిల్ గుర్తుకి ఓటు వేసి ప్రజా సంక్షేమ ప్రభుత్వమైనా కూటమి ప్రభుత్వ విజయానికి నాంది పలికాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మూది నారాయణ స్వామి, బొదిరెడ్డి గోపి, అలమండ వీరరాఘవస్వామి, సూతి బూరయ్య, పసల సూరిబాబు, పెంద్రా శ్రీను, ఎస్‌జివి సుబ్బరాజు, బెల్లాని శ్రీను, కోనాలా వెంకటరమణ, కిలారి రామచందరావు, రెడ్డి లోవరాజు, భజింతల మణి, కూరాకుల రాజు, కర్రి సుబ్బారావు, పలివెల వెంకటేశ్వరరావు, మామిడి లలిత, ఎండగుండి నాగబాబు, బచ్చల శివ, బుగత శ్రీను, శంకాని బాబ్జి, పెద్ద సంఖ్యలో టీడీపి, జనసేన, బిజెపి శ్రేణులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఆఫ్రికన్ న్యూ ఇయర్ వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం, ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు వివిధ భారతీయ రాష్ట్రాలు మరియు ఆఫ్రికన్ న్యూ ఇయర్ సందర్భాన్ని పురస్కరించుకుని ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కళాశాలకు చెందిన జాతీయ మరియు అంతర్జాతీయ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, వారి సాంప్రదాయ ఆహారాలను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు ఉగాది పచ్చడిని తయారు చేసి హాజరైన అందరికీ పంచారు. బెంగాలీ ముక్కన్ మిల్క్ మిఠాయిలు, తమిళనాడు భోలీ, ఆంధ్రప్రదేశ్ సీసా ఆనపకాయ కేసరి, మరియు జింబాబ్వే ప్రత్యేక సోయా రైస్, క్రే ఫిష్ కర్రీ తదితర పదార్థాలు విద్యార్థులు అందించిన గమనించదగిన వంటకాలు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి సతీష్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించదం వల్ల విద్యార్థులలో సోదరభావం, స్నేహభావం పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది స్వరూప, సుజియా మరియు ఇతర అధ్యాపకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఘనంగా పూలే జయంతి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో కాకినాడ జిల్లా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బుల్లి రాజు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎగులమ్మ గుడి సెంటర్లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లి రాజు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని ఎన్నో సేవలు కార్యక్రమాలు చేశారన్నారు. మనం అందరం యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు ముచ్చి అప్పలరాజు, మదినే నూకరాజు, ఓమ్మి గంగరాజు, యడ్ల వీరాస్వామి, కిలపర్తి శ్రీను, కట్టమూరు కొండబాబు, ఎం రాజారావు, ఎం నాగబాబు, అప్పన బాబు, రీసు నాగరాజు, స్వర్ణపుడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను సాకారం చేద్దాం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జ్యోతిరావు పూలే ఆశయాలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరం ఏకతాటిపై ముందుకు సాగుదామని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు పిలుపు నిచ్చారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ హాల్లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ళ సుబ్బారావు ముఖ్యఅతిథిగాను, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప విశిష్ట అతిథులుగా విచ్చేశారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ముప్పాళ్ళ మాట్లాడుతూ ఆనాడు సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన మహనీయ మూర్తి పూలే అని పేర్కొన్నారు. ఆయన తో పాటు ఆయన భార్య సావిత్రిబాయి పూలే కూడా ఆనాడు అనేకమంది బాలికలకు విద్యాబోధన చేసి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేలాగా కృషి చేశారన్నారు. ముఖ్యంగా ఆనాటి దురాచారాలైన బాల్యవివాహా లను రూపుమాపేందుకు కృషి చేశారని, వితంతువులకు పునర్వివాహాలు చేశారన్నారు. అటువంటి సమతా మమతలు కలిగిన మానవతా మూర్తి పూలే మహ నీయుడని, ఆయన త్యాగం ఎన్నటికీ మరచిపోలేనిదని అన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు స్వర్ణ పాప, అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కాశీ శ్రీనివాసరావు, మాజీ జనరల్ సెక్రటరీ బట్టు సునీల్ కుమార్, సీనియర్ న్యాయవాదులు మారెం రోశయ్య చంద్ర, అంబటి మురళీకృష్ణ, లేడీ రిప్రజెంటేటివ్ కొండేటి వరలక్ష్మి, సీనియర్ న్యాయవాది దాసరి అమ్ములు మాట్లాడారు. కమిటీ సభ్యులు తీడా ఆంజనేయులు వందన సమర్పణ చేశారు . ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ కర్రా హనుమంతరావు, సీనియర్ ఈసీ మెంబర్ పి ఎల్ ఎన్ ప్రసాద్, లేడీ మెంబర్ పద్మిని, సీనియర్ న్యాయవాదులు కానూరి వెంకటరావు, నరాల రమణమూర్తి నరసింగ శ్రీనివాస్ , నాగరాజు, జెవివి రమణ, సిరిపురపు నాగేశ్వరరావు, ఫిలిప్ ప్రేమ్ కుమార్, పేడూరి యుగంధర్, కేవీవిఎస్ఎస్ సత్యనారాయణ, గణేష్, గొట్టిముక్కల అనంతరావు, కొండేటి రాంకుమార్, భువనేశ్వర్, ప్రభాత్, సాయి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం సామాజిక బాధ్యత

విశాలాంధ్ర - రాజానగరం : ఓటు హక్కు వినియోగం సామాజిక బాధ్యతాని సార్వత్రిక ఎన్నికల రాష్ట్ర సాధారణ పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా అన్నారు. తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా మండలం లోని తూర్పు గానుగూడెం చెక్ పోస్టుతో పాటు దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన మోడల్ ఈవీఎం కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా తూర్పు గానుగూడెం చెక్ పోస్ట్ వద్ద రికార్డులను పరిశీలించగా, దివాన్ చెరువు మోడల్ ఈవీఎం కేంద్రం వద్ద యువ ఓటర్లుతో సంభాషించి గ్రూపు ఫోటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కొత్తగా ఓటు హక్కు కలిగిన యువ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వెయ్యాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీ లత పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రాకు వివరిస్తూ జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ద్వారా వివిధ చెక్ పోస్ట్ లపై నిఘా పెట్టామన్నారు. బయట రాష్ట్రాల నుంచి ఎటువంటి అనుసంధానం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఆర్డీవో ఏ.చైత్ర వర్షిణి, డిటీ సునీత, ఎక్సైజ్,పోలిస్,అటవీ శాఖ, రెవిన్యూ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షురాలు, కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శాసన సభ అభ్యర్థి అరిగెల అరుణ కుమారి పేర్కొన్నారు. కొవ్వూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం ప్రచార వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి దీనికి నిదర్శనం అని తెలిపారు. ప్రత్యేక హెూదా, విశాఖ హుక్కు ఫ్యాక్టరీ పై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరి కలిగి ఉందని కావున రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంధం బాపూజీ,గుమ్మాపు జాన్, బోణిగే రాంబాబు, అందే నాగభూషణం, బొచ్చు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైసీపీకే ఉంది

విశాలాంధ్ర - రాజానగరం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి ఓటు అడిగే హక్కు వైసీపీకి మాత్రమే ఉందని నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాధేయ పాలెం గ్రామంలో శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం,కొత్త తుంగపాడు, పాత తుంగపాడు గ్రామాలకు చెందిన వైసిపి నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అసంతృప్తికి తావు లేకుండా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమం,అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళు తున్నారని ముఖ్యమంత్రి జగన్‌ని కొనియాడారు.రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, విద్య, వైద్యానికి అధిక ప్రాధ్యాన్యత ఇచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి ఒకవైపు పోటీ పడుతుంటే,ఏ పనీ చేయని చంద్రబాబు కూటమిగా జతకట్టి మరోవైపు పోటీకి వస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో అసంబ్లీ స్థానంలో ఎమ్మెల్యే రాజాను, ఎంపీ స్థానంలో తనను గెలిపించాలని కోరారు.తొలుత పులే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా మళ్ళీ జగనే కావాలి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : పేదల కోసం నిరంతరం పాటుపడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. వైసిపి నాయకుడు పితాని బాలకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లిం సోదరులు అన్ని రంగాల్లో ఎదగాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ముస్లిం సోదరులు అన్ని విధాలుగా పైకి రావాలని, మీకు కచ్చితంగా అల్లా ఆశీస్సులు ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. నరసయ్య అగ్రహారంలోని సున్ని జామియా మజీద్‌లో గురువారం జరిగిన రంజాన్ వేడుకలలో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల పిల్లలు ఉన్నత చదువులు చదువుకుని లక్ష్యాలను సాధించేదిశగా కృషి చేయాలని, అల్లా ఆశీస్సులు మీకు ఉంటాయని అన్నారు.

దూషించడం.. మభ్యపెట్టడం చంద్రబాబు నైజం

విశాలాంధ్ర-ఆచంట: వల్లూరులో ఎన్నికల శంఖారావంలో భాగంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథ రాజు పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆశీస్సులు తీసుకొన్నారు. అయిదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేసి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిన్న మొన్నటి వరకూ చంద్రబాబు వలంటీర్లను మానసిక క్షోభకు గురి చేసి నేడు కొత్త పల్లవి అందుకొన్నారని, గోనె సంచులు మోసే ఉద్యోగం అంటూ వలంటీర్లను కించ పరిచారని, వలంటరీ వ్యవస్థ వల్ల డేటా చోరీ, కిడ్నాప్‌లు జరుగుతాయని విపరీత వ్యాఖ్యలు చేసి, చంద్రబాబుకూటమి నాయకులు నిత్యం దూషించడంతో పాటు, ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్లును ప్రజా సేవ నుంచి దూరం చేసారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్ ,రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఛైర్మన్ మేడిది జాన్సన్,ఆచంట మండల పాస్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బొడ్డు డేవిడ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్... ఎన్డీఏ కూటమిలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర-మండవల్లి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి కూటమిలోకి భారీగా చేరికలు జరిగాయి. గురువారం మండవల్లి గ్రామంలో కైకలూరు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు,పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి (బాబ్జి), చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ బాబి,నారగాని వెంకట నాగేశ్వరరావు సమక్షంలో మండవల్లి, గన్నవరం, అయ్యవారి రుద్రవరం గ్రామాలకు చెందిన వందమందికి పైగా వైసిపి నాయకులు, కార్యకర్తలు గుడివాడ చిట్టిబాబు(మాజీ సర్పంచ్) ఆధ్వర్యంలో కామినేని సమక్షంలో కూటమి తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి ఎమ్మెల్లే కామినేని శ్రీనివాస్ ఎన్డీఏ కూటమి కండువా కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు.

గిడ్డంగి సదుపాయం కల్పించే బాధ్యత తీసుకుంటాం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలం అభివృద్ధిలో భాగంగా ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెంలో కీలకమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి , వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పంటను నిలువ చేసుకునే గిడ్డంగి సదుపాయాన్ని ఏర్పాటు చేసే బాధ్యత తెలుగుదేశం,జనసేన, బిజెపి, కూటమిలు తీసుకుంటుందని మండల టిడిపి అధ్యక్షులు పారేపల్లి నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014లో మాట ఇచ్చినప్పటికీ కొన్ని శక్తుల వలన కార్యరూపం దాల్చలేదని అందుచేత ఈ అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని , ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన,బిజెపి కూటమి అధికారం వచ్చిన వెంటనే కచ్చితంగా అభివృద్ధి కార్యక్రమాలను సాధిస్తామని నరేష్ తెలియజేశారు.

దివ్యాంగులకు హీల్ కృత్రిమ అవయవాలు

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన కృత్రిమ అవయవాలు మరింత సౌకర్యవంతంగా దివ్యాంగులకు ఉపయోగపడతాయని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ బి. వేణుగోపా రెడ్డి అన్నారు. తోటపల్లిలోని ఎలిజబెత్ పాంటన్ లెగసీ ఆఫ్ హెూప్ - హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన రావిరాల జ్యోతి, విజయవాడకు చెందిన వడ్డాది రాజు, అబ్దుల్ వజీరుద్దీన్, ఒరిస్సాకు చెందిన టక్రి జ్యోతి, గన్నవరానికి చెందిన ప్రత్తిపాటి జేమ్స్ లకు కృత్రిమ కాళ్ళను అయన అందచేశారు. కృత్రిమ కాళ్లకు ఆర్థిక సహాయం అందచేసిన వల్లభనేని లక్ష్మి కమల, లయన్ చలమలశెట్టి మనోజ్ కుమార్, కాటా శివనాగేంద్రమ్మలను ఆయన అభినందించారు. అనంతరం, హీల్ పాఠశాలలో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు వారి సహకారముతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను అయన ప్రారంభించారు. ఈ కార్యక్రమములో బి. సులేఖ, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఈఓ కూరపాటి అజయ్ కుమార్, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా

విశాలాంధ్ర- తణుకు: నియోజకవర్గంలో అభివృద్ధి, అవినీతిపై బహిరంగ చర్చకు వస్తారా అని ఎన్.డి.ఎ. కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సూటిగా ప్రశ్నించారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆరిమిల్లి మాట్లాడారు.ప్రజాగళం సభ విజయ వంతం కావడంతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు కళ్ళు బైర్లు కమ్మాయని, ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా మాట్లాడేస్తున్నారన్నారు. తణుకు నరేంద్ర సెంటర్లో బహిరంగ చర్చకు తాము సిద్ధమని... సమయం తేదీ కారుమూరి చెప్పినట్లయితే, తామంతా వస్తామని ప్రజల ముందు బహిరంగంగా అన్ని విషయాలు మాట్లాడి తేల్చుకుందామని స్పష్టం చేశారు. తణుకులో ప్రజాగళం సభ విజయవంతం చేసినందుకు తెలుగుదేశం,జనసేన, బీజేపీ నాయకులకు,కార్యకర్తలకు,అభిమానులకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దొమ్మేటి వెంకట సుధాకర్, తణుకు పట్టణ తెదేపా అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, తణుకు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు చిక్కాల వేణు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పోలిశెట్టి చంటి, ఆళ్తి సత్యనారాయణ, కడియాల సూర్యనారాయణ, తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మేలు రకమైన విత్తనాలతో రైతులకు లాభాలు

విశాలాంధ్ర-పెదవేగి: రైతులు మేలు రకమైన వ్యవసాయ విత్తనాలను ఎంచుకున్నట్లయితే లాభాలను అధికంగా పొంద వచ్చునని పెదవేగి మండలం కే కన్నాపురం రైతు బి.అంజనేయులు తెలిపారు. గురువారం పెదవేగి మండలం కే కన్నాపురం గ్రామంలో ఈ రైతు పండించిన వివంట సీడ్స్ వారి హైబ్రిడ్ పుచ్చకాయల పంటను రైతులు, కంపెనీ వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వివంట సీడ్స్ కంపెనీ వారు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన గింజలను ఎంపిక చేసుకున్నప్పుడే రైతులు లాభాల బాట పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివంట సీడ్స్ కంపెనీ సిబ్బంది కిషోర్, పి. వెంకటేశ్వరరావు, ముస్సే శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యవంతం చేసిన జ్యోతిబాపూలే

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: బీసీలే సమాజానికి వెన్నుముకని అలాంటి వారిని ముందుండి నడిపించి వారిలో చైతన్యం తీసుకొచ్చిన మహానేత జ్యోతిరావు పూలే అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక జనసేన కార్యాలయం వద్ద గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జనసేన పట్టణ అధ్యక్షుడు వత్తనపల్లి కాశీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడో మహారాష్ట్రలో పుట్టి బీసీల అభ్యున్నతి కోసం పోరాడి, వారిలో చైతన్యం తీసుకురావడానికి తన భార్య సావిత్రిబాయిపూలేను ఉపాధ్యాయురాలిగా ప్రోత్సహించిన మహెూన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

కైకలూరులో: సమాజంలో అసమానతలకు కుల వ్యవస్థే మూలమనే సత్యాన్ని గ్రహించి అసమానతలకు వ్యతిరేకంగా దళిత, గిరిజన, బలహీనవర్గాల ప్రజలను చైతన్య పరచి పురుషులతో సమానంగా మహిళలు విద్యను అభ్యసించాలని వారి భార్య సావిత్రి బాయి పూలే మొదలు పెట్టిన గొప్ప సంఘ సంస్కర్త, ప్రతి ఒక్కరు నవ సమాజస్థాపన కొరకు పూలే అడుగుజాడల్లో నడవాలని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ అన్నారు. ఈ సందర్భముగా కైకలూరులోని కోరుకొల్లు, కలిదిండి జ్యోతిరావ్ పూలే సెంటర్‌లో జ్యోతి రావ్ పూలే 198వ జయంతి సందర్భంగా మహాత్మా పూలే విగ్రహమునకు మండల నాయకులు, గ్రామ నాయకులతో కలసి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: టిడిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించిన అనంతరం టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థ సారధి మాట్లాడుతూ భారతదేశంలో పూలే అంట రానితనం కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనుభావుడని వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి డ్వాక్రా అంగన్వాడీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, టిడిపి నాయకులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, మైలాబత్తుల ఐజాక్ బాబు, చెల్లబోయిన గోవింద్, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, దొంగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఎన్నికల శిబిరంలో: జనసేన ఎన్నికల శిబిరంలో జ్యోతిరావు పూలే 197 వ జయంతి వేడుకలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇందుకూరి రామలింగరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు వేండ్ర శ్రీనివాసరావు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, మైలబతుల ఐజాక్ బాబు, భీమాల శ్రీరామ్మూర్తి , గూడూరి సుబ్బారావు, మెంటే గోపీ, ఎద్దు యేసుపాదం నేదునూరి గంగాధర్ తిలక్ కోండ్రు శ్రీను ముచ్చకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయిలో : 75 ఏళ్ళ స్వతంత్ర భారత దేశంలో దళితులు, బీసీలు మహిళలు చట్టసభలలో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు పదిమందిలో చిన్న చిన్న వాళ్ళ ముందు చేతులు కట్టుకుని నిలబడే విధానం కొనసాగుతుందని దీనికి స్వస్తి పలుకుదామని సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఇవి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో ఉపాధి పనుల వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

మత సామరస్యానికి రంజాన్ ప్రతీక

విశాలాంధ్ర -భీమవరం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని మాజీ ఎమ్మెల్యే, భీమవరం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజ నేయులు అన్నారు. రంజాన్ సందర్భంగా నరసయ్య అగ్రహారం లోని సున్ని జామియా ఈద్గ మైదానంలో ఆయన పాల్గొని ముస్లిమ్ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పులపర్తి మాట్లాడుతూ ఖురాన్ బోధనల ప్రభావం సమాజంపై ఎంతగానో ఉంటుందని, రంజాన్ మాసంలో చేపట్టిన ఉపవాస దీక్షలు స్వీయ క్రమశిక్షణ, జీవితం పట్ల సానకూల సానకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. సహనం, పరోపకారం, త్యాగం వంటి మానవీయ విలువలు రంజాన్ మాసం పెంపొందిస్తుందని పులపర్తి పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ నెల రోజులపాటు జరిగిన రంజాన్ ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు గొప్ప ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయని అన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, బండి రమేష్ కుమార్, టీడీపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను భీమడోలు మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం బుధవారం నెలవంక కనబడడంతో గురు వారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. భీమడోలు సంతమార్కెట్ మసీదు వద్దనుండి ఊరేగింపుగా ముస్లిం సోదరులు పీర్ల చెరువు ఈద్గా మైదానానికి చేరుకుని మజీద్ హిమామ్ దిల్షాద్ నేతృత్వంలో సామూహిక ప్రార్థనలను నిర్వహించారు. అధికసంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. మజీద్ హిమామ్ దిల్షాద్ ఖురాన్ సూక్తులను వినిపించి, ప్రత్యేక ప్రార్థనలు దువా చేయించారు. ముస్లింల జీవితంలో రంజాన్‌కు ఎంతో ప్రాధాన్యత కలదని, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ రంజాన్ మాసంలో ఆవిర్భవించిం దన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించాలన్నారు. ప్రార్థనలు అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ చైర్మన్ షేక్ హసేనా, సైన్ షా సిద్దిఖ్, రసూల్, షరీఫ్, జానీ, మన్సూర్, గాలీబ్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా కొయ్యలగూడెం పట్టణంలో జామియా మస్జిద్ వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం గురువులు రంజాన్ పండుగ విశిష్టతను ముస్లిం సోదరులకు తెలియజేశారు. మండలంలో పలు గ్రామాలలో కూడా మస్జిద్ ల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ పూలే 1827లో ఏప్రిల్ 11న జన్మించారని ఆయన సంఘ సంస్కర్త, ఆలోచనాపరుడు, సామాజిక కార్యకర్త అని కొనియా డారు. అంటరానితనం, మహిళా అభ్యుదయానికి కృషి చేసిన వ్యక్తి 180 సంవత్సరాల క్రితమే శ్రామిక, కులాల ఐక్యత కోసం కృషి చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువత పూలే గురించి తెలుసుకోవాలి

ప్రతి ఒక్కరూ పూలే గురించి తెలుసుకోవాలని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సూచించారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ వద్ద ఉన్న విగ్రహానికి రమేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అర్‌పిఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిసెట్టి సతీష్, ఉలిసె ఐ రాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కాజులూరులో : సమాజ, సమాన హక్కుల కోసం, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం, సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని రెవిన్యూ డివిజనల్ అధికారి ఎస్. సుధా సాగర్ అన్నారు. గురువారం స్థానిక రామచంద్రాపురం ఆర్డిఓ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలను సిబ్బందితో కలిసి జరుపుకున్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పుష్ప గుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ నిర్మాణ కృషీవలుడని, భవిష్యత్తు తరాల స్ఫూర్తి ప్రధాతగా మహాత్మా జ్యోతి రావు పూలే పేరుగాంచారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రామచంద్రపురం వెంకట్రావు, కాజులూరు తహసీల్దార్ శాంతి లక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో: బడుగు వర్గాల ఆశాజ్యోతి, అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మ జ్యోతి రావు పూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని సీనియర్ అడ్వకేట్ వడ్డీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం జ్యోతిభాపూలే 197వ జయంతిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్, మాత రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిభా పూలే జయంతిని పురస్కరించుకుని పూలే చిత్ర పటానికి పూలమాలలు అలంకరించి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఆర్గనైజేషన్ సభ్యులు మాతరమా భాయ్, అంబేద్కర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పి. రజిని, కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో : నడుపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిభాపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిడదవోలు నియోజకవర్గ బీఎస్పీ యం యల్ ఎ అభ్యర్థి గుమ్మాపు చిత్రసేను పాల్గొని మాట్లాడుతూ శూద్ర ,అతి శూద్ర కులాలకు విద్య అందించడం కోసం, సొంతంగా పాఠశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేసి జ్ఞానాన్ని పంచిన గొప్ప యోధుడు మహాత్మా జ్యోతిబా పులే అని, కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసే నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అరేపల్లి. అంజి బాబు, కప్పల. ఇశ్రాయిల్, చిటికిన. సత్తిబాబు, అరేపల్లి. నరేష్, నరమామిడి. నరసన్నలతో పాటు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరులో : జ్యోతి రావు పూలే మహెూన్నతమైన వ్యక్తి అని కొవ్వూరు టిడిపి దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి కంతమణి రామకృష్ణలు అన్నారు. వీరి ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరు పార్టీ ఆఫీస్ నందు పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సుర పని చిన్ని, నియోజకవర్గ బీసీ నాయకులు మరియు టీడీపీ- జనసేన-బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో : పేద మధ్యతరగతి వర్గాల అభ్యున్నతిక కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొవ్వూరు వైకాపా అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకల్లో వెంకట్రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకుడు 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, సుర్ల నగేష్, చెప అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో : సంఘసంస్కర్త మహాత్మా పూలే జయంతిని ఉండ్రాజవరం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం ఎస్సై వి. అప్పలరాజు మాట్లాడుతూ సామాజికంగా గానీ ఒక చైతన్యవంతమైన జీవితం సాగించేందుకు చదువు చాలా అవసరమని మహాత్మా జ్యోతిరావు పూలే ఆనాడే చెప్పారని, చెప్పడమే కాకుండా దానిని ఆచరించారన్నారు. కుల, లింగ, వివక్షతకు తావు లేకుండా విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిరావుపూలే ఆలోచన విధానాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మండల బీసీ సంఘం అధ్యక్షుడు పివి రాము మాట్లాడుతూ పూలే తన భార్య సావిత్రిబాయికి గురువుగా మారి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. బాలికలకు, మహిళలకు చదువుకునేందుకు ప్రత్యేకంగా పాఠశాలలను నెలకొల్పారని, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఆయన చేపట్టిన సంస్కరణలు చాలా గొప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం సభ్యులు గంగలకుర్తి సీతారామసాగర్, వేముల వెంకట సత్యనారాయణ, వెలిగట్ల ప్రభువరం, కోన జయ, మారిశెట్టి నాగేశ్వరరావు, సరిదే ఉదయ్ కుమార్, వీరమల్ల బాలాజీ, పెదగాడి శ్రీనివాసు, ఐశెట్టి సత్యనారాయణ, ఏలూరి బ్రహ్మాజీ, పిప్పళ్ళ దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సామాజిక వర్గం వైసీపీకి అండగా నిలవాలి

విశాలాంధ్ర - అనపర్తి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనేందుకు వ్యతిరేక శక్తులన్నీ ఏకమైన ప్రస్తుత నేపథ్యంలో రెడ్డి సామాజిక వర్గం వైసిపికి అండగా నిలబడాలని ఓసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జి. కరుణాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం అనపర్తిలో జరిగిన విలేకరుల సమావేశంలో కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి రెడ్డిలను విభజించి వైసీపీకి దూరం చేసేందుకు, ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నదని అన్నారు. రెడ్డిలను నిత్యం ద్వేషిస్తూ ఈ కుల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై నిందలు మోపుతూ చంద్రబాబు పైశాచిక ఆనందం పొందుతున్నారని కరుణాకర్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు తన సామాజిక వర్గానికి పెద్ద పీట వేసి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులను చిన్న చూపు చూసిన మాట వాస్తవమా కాదా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, సతీష్, రవి శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రజల చూపు జనసేన వైపే

విశాలాంధ్ర - సీతానగరం: ప్రజల చూపు జనసేన వైపే ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నా సేన నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని బొబ్బిల్లంక గ్రామ పంచాయితీ పరిధిలో గురువారం కూటమి పార్టీలు అయినా టీడీపీ, జనసేన, భాజపా నాయకులతో కలిసి జనం కోసం జనసేన అంటూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు వైసిపి ప్రభుత్వ పాలన పై అసహనం చెందారు అని అన్నారు. పేదల ఇళ్ళ స్థలాలు ఇస్తామంటూ ప్రకటనలకే పరిమితం అయ్యారని అన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామంటూ ప్రకటనలు చేసినా ఫ్లెక్సిలో మాత్రమే అభివృద్ధి కనబడుతుంది కానీ గ్రామాల్లో పర్యటిస్తుంటే అభివృద్ధి ఎక్కడ కనపడడం లేదని అన్నారు. ఒక అవకాశం జనసేనకు ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెండ్యాల అవిస్వామి, పోలిన కృష్ణ, పోలిన రామచంద్రం, నున్న కృష్ణ, శ్రీను, బిక్కిన సతీష్, చుట్టూరీ రంగారావు జనసేన నాయకులు విజయ్ శంకర్, దూలం కృష్ణ, శశికళ తదితర టీడీపీ, జనసేన, భాజపా పార్టీల నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీఎస్పీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-పెరవలి : బీఎస్పీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని నడుపల్లి, నడుపల్లి కోట గ్రామాల్లో బియస్పీ యంయల్ఎ అభ్యర్థి గుమ్మాపు చిత్రసేను ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ సిపి, టీడీపీ, జనసేన, బీజేపీలు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తూ ఓటర్లను మోసం చేస్తున్నాయన్నారు. ఆయన వెంట నల్లి రమేష్, కప్పల ఇశ్రాయిల్, బత్తిన ఆశీర్వాదము,మర్రి మహాలక్షముడు,గొల్ల ధనరాజు, చిన్నం. వెంకటేశ్వర్లు, మోర్త. చింతరాజు,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బ్రహ్మరథం

విశాలాంధ్ర-చాట్రాయి: ఊరూరా ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని నూజివీడు నియోజకవర్గ తెదేపా అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో జరిగిన జయహెూ బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చాట్రాయి మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా తెలుగుదేశం పార్టీకి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని అన్నారు. ప్రతి సామాన్య కార్యకర్తకు నేను అండగా వుంటానని వ్యక్తిగత బాధ్యతతో పని చేస్తానన్నారు. టిడిపి విజయం తథ్యమన్నారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే పార్థసారథిని గెలిపించుకోవడమే మార్గం అన్నారు. తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో చనుబండ ప్రభుత్వ పశు వైద్యశాలలో కనీసం వైద్యుడు కూడా లేక ఆస్పత్రి కి తాళం వేస్తే పై అధికారులకు ఫిర్యాదు చేయడం నిరసన కార్యక్రమాలు చేయడం వల్ల తాళం తీశారని గుర్తు చేశారు. తెలుగు దేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో పూర్తిగా రైతు వ్యతిరేక పాలన సాగుతోందని దుయ్యబట్టారు. తెదేపా మండల మాజీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు మాట్లాడుతూ చాట్రాయి మండలంలో ఉన్న అతిపెద్ద వైసిపి నాయకుడు ఏపీ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కి రాష్ట్రస్థాయిలో పదవి ఉన్న దాని వలన ప్రయోజనం ఏమిటని అది ఎవరికీ తెలియని పదవని దానివల్ల చాట్రాయి మండలానికి ఒరిగిందేమిటి అన్నారు. సభకు తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు చీదిరాల మారేశ్వరరావు అధ్యక్షత వహించగా తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులుజగ్గవరపు వెంకట రెడ్డి నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రాయపూడికి రబీంద్ర రత్న సేవా పురస్కారం

విశాలాంధ్ర - పాలకొల్లు : ఉత్తమ ఉపాధ్యాయుడు, ప్రముఖ సామాజిక వేత్త, ఎవరికి కష్టం వచ్చినా నేనున్నా అంటూ ముందుకు వచ్చి చేయూతనిస్తూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రాయపూడి భవాని శంకర్ ప్రసాద్‌కు రబీంద్ర రత్న పురస్కారం లభించింది. ఈ విషయాన్ని గురువారం ఆయన ఒక ప్రకటనలో మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా భవాని ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. తనకు పురస్కారాలు లభించడం కొత్త కాదన్నారు. ఉత్తమ విద్య, విద్యార్థులకు సౌకర్యాల కల్పన, పరిశుభ్రత, సేవ భావం, చారిటీ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని రబీంద్ర రత్న పురస్కారం అందజేశారని తెలిపారు. తనకు వచ్చే అవార్డులు పురస్కారాలు తన బాధ్యతను మరింత పెంచుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. తన ఉన్నతి కి, ఆశయ సాధనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

నాటు సారా తయారీ కేంద్రంపై దాడులు

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని బందంచర్ల గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డీఎస్పీ కె. జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. 20లీటర్లు నాటు సారాను, 1500 లీటర్లు బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని, 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి సారా తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ సామాగ్రిని స్వాధీనం చేసుకుట్లుగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు.

ఆదిత్యలో ముగిసిన శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్ సారథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై విద్యార్థుల అభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజ్ఞానాదయంగా ముగిసింది. ఈ కార్యక్రమం అయిదు రోజుల పాటు కొనసాగింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్‌లో విశేష సేవలు అందిస్తున్న పి రమా కాంత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగంలోని తృతీయ సవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి అని డీన్ అకాడమిక్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్ అన్నారు. అలాగే ఇటువంటివి మెకానికల్ విద్యార్థులకి చాల అవసరం అని డీన్ ఐక్యూఏసి డా జి రామ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వైకెఎస్ సుబ్బా రావు, వర్క్ షాప్ కోఆర్డినేటర్ నల్ల భాను తేజ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.